కథ

# పరిచయం

**– కె. మురళీమోహన్**

**బ్రీఫ్‌కేస్‌ని సీటు క్రింద చైన్‌తో లాక్ చేసి, పుస్తకం చదువుతూ కిటికీ దగ్గర కూర్చున్నాడు హేమంత్.** అది తనకు చాలా నచ్చిన పుస్తకం, ఎప్పుడు ఊరు వెళ్లినా తనతో తీసుకు వెళతాడు. శాలిని తనకు పరిచయమైన తరువాత బహుమతిగా ఇచ్చిన మొదటి పుస్తకం. తన స్వహస్తాలతో మొదటి పేజీలో స్నేహం గురించి రాసి సంతకం చేసి ఇచ్చింది.

"It is not known to anybody when
friendship
is formed between two people
while filling up a vessel drop by drop
there is one last drop by which water
overflows"

ఇదే ప్లాట్‌ఫాం మీద తమ పరిచయం అయిన సంగతులు గుర్తు చేసుకుంటూ, పుస్తకం చదువుకుంటున్నాడు. శాలిని రాకకోసం మధ్య మధ్యలో ట్రైన్‌లోంచి బయటికి చూస్తున్నాడు. వెలుతురు సరిగా లేకపోవటంతో చదవటం ఆపేసి, ప్లాట్‌ఫారం మీదికి దిగాడు.

బెంగుళూర్ ఎక్స్‌ప్రెస్ రెండో నంబరు ప్లాట్‌ఫారం మీద ఆగి వుంది. ఎవరి పనుల్లో వాళ్లు హడావుడిగా వున్నారు. హేమంత్ కొంచెం అసహనంగా అటు ఇటూ చూస్తున్నాడు, ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లుగా.

'శాలిని ఇంకా రాలేదేమిటి ఏడుగంటలకు రైలు వెళుతుంది. అప్పుడే ఆరున్నర అయింది. ఆటో దొరికిందో లేదో ! సూట్‌కేస్ బరువుగా గాని లేదుకదా ! మొదటి ప్లాట్‌ఫారం మీద ఎదురుచూస్తే బావుండేది. అనవసరంగా కంపార్ట్‌మెంట్ దగ్గరికి రమ్మని చెప్పాను. మెట్లన్ని ఎక్కి దిగి రావాలంటే తనకైనా కష్టం కదా ! శాలినితో కాసేపైనా గడపకపోతే, మళ్లీ వారం రోజుల దాకా కనబడదు ! తన భార్య శాలిని రాకను తలుచుకుంటూ, మెట్లవైపు చూస్తున్నాడు.

హేమంత్ ఒక ప్రైవేట్ కంపెనీలో అసిస్టెంట్ మేనేజరుగా పనిచేస్తున్నాడు. అందగాడా అంటే కాదని చెప్పలేం అవునని చెప్పలేం తనకంటూ ఒక ప్రత్యేకత వుండాలని కోరుకుంటాడు. హేమంత్, శాలిని మాత్రం చూడ చక్కని జంట. ప్రస్తుతం ఆఫీస్ పనిమీద వారం రోజుల ప్రయాణం.

కంపార్ట్‌మెంట్ ఎదురుగా ఫ్రూట్‌జ్యూస్ బండి దగ్గరకి వెళ్లి ఒక పైనాపిల్ జ్యూస్ ఆర్డర్ చేశాడు హేమంత్. అంతలో అక్కడికి ఒక అమ్మాయి ఎయిర్‌బ్యాగ్‌తో వచ్చి, యాపిల్ జ్యూస్ ఆర్డర్ చేసింది. యధాలాపంగా హేమంత్ ఆ అమ్మాయిని చూశాడు. చక్కటి డ్రస్సింగ్‌తో చూడ ముచ్చటైన రూపం. ఎవరూ తోడు వచ్చినట్లు లేరు, కాని ఎవరి కోసమో ఎదురు చూస్తోంది, ఆపిల్ జ్యూస్ తాగుతూ.

హేమంత్‌కి కొత్త వారితో స్నేహం చేయటం సరదా. బహుశా టూర్స్‌కి ఎక్కువగా వెళ్లటం వల్లనేమో, అలా అలవాటు అయ్యింది. జ్యూస్ తాగిన తరువాత, ఒక వాటర్ బాటిల్ తీసుకొని "ఎంత అయింది" అంటూ 50 రూపాయల నోటు ఇచ్చాడు హేమంత్. "25 రూపాయలు సార్, చిల్లర లేదండి" చెప్పాడు బండివాడు. అదే సమయానికి యాపిల్ జ్యూస్ తాగిన అమ్మాయి 100 రూపాయల నోటు ఇచ్చింది. వాటర్ బాటిల్ తీసుకుంటూ "మేడమ్ చిల్లర కష్టంగా వుంది. సార్ ఇప్పుడే యాభై రూపాయల నోటు ఇచ్చారు" చెప్పాడు బండివాడు.

హేమంత్ ఆమె వైపు తిరిగి, "ఎక్స్క్యూజ్‌మీ ! మీపేరు, కోచ్ నెంబర్ చెబితే డబ్బులు తరువాత నేను తీసుకుంటాను" అని చెప్పి, బండివాడికి ఇద్దరి డబ్బులు కలిపి ఏభై రూపాయలు తీసుకొమ్మని చెప్పాడు. "కోచ్ నంబరు S-6, పేరు అపూర్వ. డబ్బులు మీరు మరిచిపోకుండా తీసుకోవాలి. మీరు ఎక్కడికి వెళుతున్నారు" ?

"నేను కూడా బెంగుళూరికే లెండి, అదే కోచ్" చెప్పాడు హేమంత్.

✣ ✣ ✣

శాలిని ఆటోదిగి, ప్లాట్‌ఫామ్ వైపు నడిచింది. సూట్‌కేస్ కొంచెం బరువుగానే వుంది. వారంరోజుల ప్రయాణం కదా ! రైలేమో రెండో నంబరు ప్లాట్‌ఫారం మీద వుంది. రెండో చేతిలో ఫుడ్ పాకెట్, మంచినీళ్ళ బాటిల్ వున్నాయి. చెయ్యి మార్చుకుంటూ ఒకటో ప్లాట్‌ఫారం మీదికి వచ్చింది. 'పోర్టరు దొరికితే బాగుండు, ఇప్పటికే ఆలస్యం అయింది. హేమంత్ ఎదురు చూస్తూ వుంటాడు. ఆటో దిగగానే అడిగిన పోర్టర్లని కాదన్నాను. ఇక్కడేమో ఎవ్వరూ ఖాళీగా కనబడటం లేదు' అనుకుంటూ సూట్‌కేస్ కిందపెట్టి ఒక నిమిషం అటూ ఇటూ చూసింది.

ఇంతలో వెనకనుంచి "మే ఐ హెల్ప్ యూ" కొత్త గొంతు వినిపించింది. వెనక్కి తిరిగింది. "మీరు ఆటోదిగి ఇబ్బందిగా నడవటం చూశాను. నేనెలాగు ఖాళీగా వెళుతున్నాను. మీరుకూడా బెంగుళూరు ఎక్స్‌ప్రెస్‌కే అయితే, కోచ్ నంబరు చెప్పండి సూట్‌కేస్ తీసుకుని వస్తాను, మీరు ఏమీ అనుకోనంటే" అన్నాడు ప్రదీప్ తనని పరిచయం చేసుకుంటూ మనిషి జీన్స్, టీషర్టుతో హుందాగా వున్నాడు.

"కోచ్ నంబరు S-6, మీకు ఇబ్బంది కలిగిస్తున్నందుకు క్షమించండి. ఆటో దిగుతుంటే చెయ్యి రాడ్‌కి కొట్టుకుని కొంచెం నెప్పిగా వుంది" చెప్పింది శాలిని, ప్రదీపుతో బాటు మెట్లవైపు నడుస్తూ.

"నాది కూడా S-6, బెంగుళూరు వెళుతున్నాను" చెప్పాడు ప్రదీప్.

"మీరు కూడా బెంగుళూరు వెళుతున్నారా ? లగేజీ లేకపోతే అడిగానంతే !"

"అవునండీ, ఆఫీసునుండి సరాసరి వస్తున్నాను. ప్రైవేటు ఆఫీసు కదండి, తొందరగా రావటానికి పర్మిషను తీసుకోవాలి. అందులోను బయటవూరికి బంధువుల ఇంట్లో పెళ్లికి వెళుతున్నాను. బ్యాగ్ కంపార్ట్‌మెంటు దగ్గరికి వచ్చేసుంటుంది".

బ్యాగ్ ఎవరు తెస్తున్నారో ప్రదీప్ చెప్పలేదు, శాలిని అడగలేదు.

సహజంగా పెద్ద అడుగులు వేసుకుంటూ ప్రదీప్ కొంచెం ముందు నడుస్తున్నాడు. శాలిని అతనితో పాటు తొందరగా నడవటానికి ప్రయత్నిస్తోంది.

✣ ✣ ✣

హేమంత్ ఇప్పుడే వస్తానని చెప్పి, రిజర్వేషన్ ఛార్ట్‌లో అపూర్వ పేరుకోసం చూశాడు. కనబడలేదు. 'అపూర్వ అబద్ధం ఎందుకు చెప్పింది. వేరే పేరుతోటి రిజర్వేషన్ చేయించుకుందేమో ! అసలు బెంగుళూరుకి వెళుతుందో, లేదో అడిగిచూద్దాం.

"మీరు బెంగుళూరుకే రిజర్వేషన్ చేయించు కున్నారా? మీ పేరు ఛార్ట్‌లో కనబడకపోతేను, ఆత్రుతతోటి అడుగుతున్నాను".

"రిజర్వేషన్ బెంగుళూరుకే చేయించాను. కానీ నా పేరు మీకు కనబడదులేండి. ఇంకో విషయం S-6 లోనే ఈ రోజుకే టికెట్ కన్‌ఫర్మ్ చేయించాను. మీరు ఏ మాత్రం కంగారు పడక్కర్లేదు" అంది చిరునవ్వుతో.

ఆమె నవ్వు అర్థం కాలేదు. తన ఆశ్చర్యం బయటికి కనబడకుండా హేమంత్ శాలిని కోసం మెట్లవైపు చూశాడు.

"మీరు ఎవరికోసం అంత ఆత్రంగా ఎదురు

చూస్తున్నారు".

"శాలిని కోసం, నా బ్యాగ్ తీసుకువస్తానంది. నేను ఆఫీసు నుంచి సరాసరి వచ్చాను".

"శాలిని ఎవరు ?" ఆత్రంగా అడిగింది అపూర్వ

"నా జీవితానికి అర్థం అనుకుంటా !" నవ్వుతూ చెప్పాడు.

"అంటే మీకు ఏమవుతారు. అంత ఆత్రంగా ఎదురుచూస్తున్నారు".

"నాకు అన్నీ తనే. మరి మీ కోసం ఎవరూ రావట్లేదా" ?

"ప్రదీప్ వస్తాడు. తను రాకపోతే ప్రయాణమే లేదు. ఇంటికెళ్లిపోతాను.

"నా పరిస్థితి **కూడా అలాంటిదే** శాలిని రాకపోతే ప్రయాణం చేయటం కష్టం. ఇంటి కెళ్ళిపోవాల్సిందే" అన్నాడు హేమంత్ టైము చూసుకుంటూ.

❖ ❖ ❖

ప్రదీప్‌తో పాటు నడవటానికి కష్టంగా వున్నా, "తొందరగా వెళ్లాలి. హేమంత్ నా కోసం ఎదురు చూస్తూ వుంటాడు. నేను వెళ్లకపోతే అతను ప్రయాణం చేయటం కష్టమే. లేటు అయితే యిద్దరమూ ఇంటికి వెళ్ళాల్సిందే" చెప్పింది శాలిని.

"మీవాళ్లు ఎవరైనా వస్తారా ! అంత కంగారుగా కనబడుతున్నారు. నా పరిస్థితి కూడా అంతే. నేను లేటుగా వెళ్తే, యిద్దరమూ ఇంటికే మరి".

'తొందరగా వెళ్లాలి. లేకపోతే ప్రయాణంలో మంచి కంపెనీ మిస్ అవుతాను' అనుకున్నాడు ప్రదీప్ టైము చూసుకుంటూ.

❖ ❖ ❖

"బాబు, ధర్మం చేయ్యి బాబు, మీ ప్రయాణం చల్లగా జరగాలి. ఆ దేవుడు చల్లగా చూస్తాడు", ఒక బిచ్చగత్తె చిన్న పళ్లెంలో దేవుణ్ణి పెట్టుకుని, హేమంత్‌ని అడిగింది. పర్సులోంచి రూపాయి బిళ్ల తీసి, పళ్లెంలో వేసాడు. ఆ అమ్మాయి అపూర్వని అడగకుండా వెళ్లిపోయింది.

"ఇలాంటివారిని ప్లాట్‌ఫారం మీదకి ఎందుకు రానిస్తారు" ఈసడించుకుంటూ అంది అపూర్వ.

"మీకు ఇలాంటివి నచ్చవా ! ఇలా ఒక మనిషి ఇంకో మనిషిని అసహ్యించుకునే పరిస్థితి మన దేశంలోనే ఎక్కువ కనిపిస్తుంది. సహాయం చేస్తే చెయ్యాలి, లేకపోతే లేదు, అంతేకాని యీ పరిస్థితికి వేరేవారిని తప్పు పట్టలేము, మన సమాజంలో".

"దేవుడి పేరు చెప్పుకుని అడుక్కోవటం దేనికి, సెంటిమెంటు మీద దెబ్బ కొడుతున్నారు యిలాంటి వారు".

"దేవుడి పేరు వాడుకుని ఎన్ని పనులు జరగటం లేదు ఈ దేశంలో. ప్రజలలో ఎంత నమ్మకం లేకపోతే, యింతమంది బాబాలు పుట్టుకొస్తారు మన చుట్టూ వున్న సమాజంలో".

"ఆ టాపిక్ ఇంక వదిలెయ్యండి. చూసినవాళ్లు మన ఇద్దరం పోట్లాడుకుంటున్నామనుకుంటారు" చెప్పింది అపూర్వ.

ఇంతలో ప్లాట్‌ఫారం మీదకి మెట్లు దిగుతూ కనిపించింది శాలిని. 'అమ్మయ్యా ! తను వచ్చేసింది. తనతో సూట్‌కేస్ లేదేంటి ? కూలీని కుదుర్చుకుందేమోలే' అనుకున్నాడు హేమంత్. దూరం నుంచి హేమంత్‌ని చూసి, చిరునవ్వుతో వచ్చేశాను అని పలకరించింది శాలిని.

'ప్రదీప్ సూట్‌కేస్ తీసుకొస్తున్నాడేమిటి ? తనతో బాటు ఇంకెవరన్నా ఆఫీసువాళ్లు వూరెళుతున్నారా ? కాని తను వెళ్లేది స్వంత పనిమీద కదా ! ఆఫీసు వాళ్లు

ఎందుకొస్తారు' అనుకుంటూ, నేనిక్కడవున్నాను అన్నట్లు చెయ్యి వూపుతూ గుర్తు చేసింది అపూర్వ. ప్రతిగా ప్రదీప్ కూడా 'చూశాను వస్తున్నాను' అని చెయ్యూపాడు.

పసుపురంగు చీర కట్టుకుని వస్తున్న శాలినిని చూపించి, "తనే శాలిని, పసుపురంగు నా కిష్టమైన కలరు. నేనెప్పుడు వూరెళ్లినా తను అదే కలరు ప్రిఫర్ చేస్తుంది" చెప్పాడు హేమంత్ అపూర్వకి. తనుకూడా దూరం నుంచి ప్రదీప్‌ను చూపించి, "తను ఎప్పుడూ ఇంతే రైలు బయలుదేరడానికి అయిదు నిమిషాలు ముందొస్తాడు. ఎప్పుడూ టెన్షనే" చెప్పింది.

ప్రదీప్ తన సూట్‌కేసు పట్టుకుని, శాలినితో బాటు వస్తున్నాడేంటి ? వీరిద్దరికి పరిచయం ఎప్పుడైంది ? బంధువుల వరస వున్నట్లు కూడా గుర్తులేదు' అనుకున్నాడు హేమంత్. దగ్గరికి వచ్చాక ఒకర్నొకరు పరిచయం చేసుకున్నారు. "హమ్మయ్య ! నువ్వు వచ్చావా. ప్రయాణం జరగదేమో అనుకున్నా, నువ్వు లేటుగా వచ్చేసరికి" చెప్పాడు హేమంత్ శాలినితో, కొంచెం రిలాక్స్‌డ్ మూడ్‌తో "సూట్‌కేస్ రాకపోతేనే ప్రయాణం మానుకుంటారా అడిగింది అపూర్వ. "కాదండి టికెటు కూడా తన దగ్గరే వుంది. పొద్దున ఇంట్లో మరిచిపోయి వచ్చాను".

"ఇంతకీ మీ ఇద్దరిలో బెంగుళూరు వెళ్లేది ఎవరు" అడిగాడు ప్రదీప్. "నేనే" చెప్పాడు హేమంత్. "మీరా నేను శాలిని గారేమో అనుకున్నా", ఆశ్చర్యంగా అన్నాడు ప్రదీప్. చిరునవ్వుతో 'నేను కాదు' అన్నట్టు తల అడ్డంగా ఊపింది శాలిని.

తన పేరు ఛార్ట్‌లో వుందేమో చూసుకుని, బ్యాగ్, టికెట్టు అపూర్వ దగ్గర నుంచి అడిగి తీసుకున్నాడు ప్రదీప్. "ఊరెళ్లేది మీరు కాదా" అపూర్వ వంక చూస్తూ, ఈసారి ఆశ్చర్యపోవటం హేమంత్ వతైంది. "లేదండి నేనలా చెప్పలేదే, మీరే అలా వూహించుకొని వుంటారు".

"నాకు పరిస్థితి అంతా అర్థమయ్యింది. ఎవ్వరు ఇంక ఆశ్చర్యపోనక్కర్లేదు. మీరిద్దరు వూరికి. మేమిద్దరం ఎవరియిళ్లకి వాళ్లు. సిగ్నల్ ఇచ్చారు రైలెక్కండి. హేవ్ ఎ హేపీ జర్నీ" చెప్పింది అపూర్వ. ప్రదీప్, హేమంత్ ఒకరినొకరు చూసి నవ్వుకున్నారు.

"మీ ఇల్లెక్కడ, ఎలా వచ్చారు" అడిగింది అపూర్వ. "పద్మారావు నగర్, ఆటోలో వచ్చాను" చెప్పింది శాలిని. "నేను మారేడుపల్లి వెళ్లాలి. దారిలో మిమ్మల్ని కారులో దింపుతాను, రండి" చెప్పింది అపూర్వ.

కొత్త పరిచయాలతో ప్రదీప్, హేమంత్ రైలెక్కి బెంగుళూర్‌కి, అపూర్వ, శాలిని కారెక్కి యిళ్లకి బయలుదేరారు. ❋

# కన్నీరు

కనుల కొలకులనుంచి జాలువారిన ఈ నీటిచుక్క..
ఎన్నెన్ని భావాలను స్పృశించి వచ్చిందో !
హృదయ కుడ్యాలను తడిమి
మనసు పొరలను చీల్చి
అడ్డుగోడలను అధిగమించి
ఉబికి వచ్చే ప్రతి కన్నీటిబొట్టూ -

ఎన్నెన్నో ఆశల తరంగాలకు సాక్షి
మరెన్నో అనుభూతుల మాలికలకు స్ఫూర్తి
అది కేవలం నీటిచుక్క మాత్రమే కాదు
రేపటి ఆశల హర్మ్యాలకు పునాది

\- ప్రసన్న రాయసం